



RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 6

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 2 జూన్ 2026

## కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

- నంద్యాలలో వైఎస్ విగ్రహం ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే
- విద్వేషాలు రగిల్చేలా వైసీపీ వివాదాలు సృష్టిస్తోంది
- సంక్షేమంలో ప్రజా ప్రభుత్వానికి సాటి లేదు
- కూటమి వచ్చినప్పటి నుంచి రూ.65,887 కోట్ల మేర పెన్షన్ల పంపిణీ
- పీఎం సేతు ద్వారా ఏపీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- విశాఖ రైల్వే జోన్ తో రాష్ట్ర ప్రజల కల సాకారం
- తుని పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**తుని, కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా వైసీపీ కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతోందని సీఎం అన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనల్ని ప్రస్తావిస్తూ వైసీపీ నేతల డ్రామాలను ఎండగట్టారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజా వేదిక సభకు హాజరై ప్రసంగించిన సీఎం వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రజల ముందు ఉంచారు. ఆ పార్టీ నేతలు ఫ్రస్టేషన్ తో ప్రతీ అంశాన్నీ వివాదం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రీ పగలు శ్రమిస్తున్నాం. వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగిస్తోంది. సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు కుతంత్రాలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని హత్యచేసి తొలుత గుండెపోటు అన్నారు. గొడ్డలితో నరికి చంపి డ్రామాలు ఆడారు. ఒక్క ఛాన్స్ అని మోసం చేసి కోడికత్తి, గులకరాయి నాటకాలు వేశారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్ని ప్రజలు తెలుసుకోవాలి. పాలన వైకుంఠపాళి కాకూడదన్నదే మా విజ్ఞప్తి. గత పాలకులు ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే 241 కోర్టు కేసులు పరిష్కరించాకే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గతంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఎగ్గొట్టారు. మేం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. అత్యంత పటిష్టంగా టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరిగింది. 40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నాపత్రాలతో ఎక్కడా అక్రమాలు



జరగకుండా భర్తీ ప్రక్రియ నిర్వహించాం. ఫ్రస్టేషన్ లో ఉన్న వైసీపీ దీనిని కూడా వివాదం చేసి రాజకీయ లబ్ధి పొందాలని ఆలోచన చేసింది. సమాజంలో అశాంతిని రేపాలని ప్రయత్నాలు జరిగాయి. జాగ్రత్తగా ఉండబట్టే గట్టిగా సమాధానం ఇవ్వగలిగాం. పరామర్శలకు వెళ్తూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లోకి విసిరేసి పోయారు. కడపకు చెందిన ఓ పాస్టర్ ను పంపి హత్యాయత్నం అంటూ డ్రామాలు ఆడారు. దానిని మా పార్టీ పై నెట్టేందుకు ప్రయత్నించారు. పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ ప్రమాదంలో చనిపోతే దానిని కూడా మాకు అంటగట్టాలని ప్రయత్నాలు జరిగాయి. సీసీ కెమెరాల సాయంతో ఈ కుట్రలను బట్టబయలు చేయగలిగాం. తిరుమలలోని కౌస్తుభం గెస్ట్ హౌస్ దగ్గర సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లను పారేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నం చేశారు. సాక్షాత్తూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నం చేసిన వారిని ఏమనాలి. వారిది వేరే మతం కావొచ్చు. దానికి మేం తప్పు పట్టటం లేదు. కానీ కుట్రలతో హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్రం చేసే కుట్రలు సరికాదని హెచ్చరిస్తున్నాను. కడపలో పెద్ద దస్తగిరిని వైసీపీ వారే ఆస్తుల వివాదంలో హత్యచేసి టీడీపీ వారిపై నెట్టేందుకు ప్రయత్నం చేశారు. నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే. వైసీపీ వాళ్లే ధ్వంసం చేశారు కాబట్టే సాక్షి పత్రికలో ఆ వార్తే రాయలేదు. కాకినాడలోనే వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేశారు. కానీ వైసీపీ ఆ ఎమ్మెల్సీకి సన్మానాలు చేసింది. రాజకీయ పార్టీగా ఈ తప్పిదాలు సరిచేసుకోకుండా ఎదురుదాడి చేస్తున్నారు. కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతున్నవారి ఆటలు సాగనీయం. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**రెండేళ్ల క్రితం విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి..**

"విధ్వంసం నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా జూన్ 4 తేదీ చరిత్రలో నిలిచిపోతుంది. గత పాలన అంతా విధ్వంసకర పాలన, బహిరంగంగా నవ్వాలని అనుకున్నా ప్రజలంతా భయపడే పరిస్థితి. ప్రజలు వెళ్లి పోకుండా కందకాలు తవ్వి, ఫెన్సింగ్ లు వేసి మరీ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. దానికి నిదర్శనం పింఛన్ల పెంపు. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు ఉన్నా...పెన్షన్లు ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4 వేలు చేశాం. దివ్యాంగులకు రూ.6,000 చేశాం. హెల్త్ పెన్షన్లు రూ.10 వేలకు, రూ.15 వేలకు

- 2లో

## పన్నుల ఎగవేతదారులపై పవన్ కళ్యాణ్ ఉక్కుపాదం.. డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!

- గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి
- పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న
- పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం




**అమరావతి,కలంకౌంటర్ :** గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?" అని పవన్ నిలదీశారు. పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో మంత్రి లోకేష్ భేటీ

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబైలో సోమవారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ అయ్యారు. సాదర స్వాగతం పలికిన సీఎంను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించి, శ్రీవారి ప్రతిమను లోకేష్ అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ ప్రతిమను సీఎం బహుకరించారు. ఏపీకి వచ్చిన పెట్టుబడులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్



గురించి మంత్రి లోకేష్ మహారాష్ట్ర సీఎంకి వివరించారు. ఏపీ విద్యా శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలు, స్కిల్ డెవలప్మెంట్ విధానాలు తెలియజేశారు. మహారాష్ట్ర ఐటీ, విద్యా శాఖలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలు సీఎంను అడిగి లోకేష్ తెలుసుకున్నారు.






# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు అందజేసిన జిల్లా కలెక్టర్, తిరుపతి ఎమ్మెల్యే





**తిరుపతి,కలంకౌంటర్ :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం తిరుపతి పట్టణంలోని ముత్యాలరెడ్డి పల్లిలో గల దుర్గా నగర్‌లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.., సామాజిక భద్రత కల్పించే ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత కలిగిన సంక్షేమ పథకాలలో ఒకటిగా నిలిచిందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా, పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఒక్క జిల్లాకే నెలకు సుమారు రూ.120 కోట్ల మేర పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇది దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమాలలో ఒకటని పేర్కొన్నారు. జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పెన్షన్ సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో సామాజిక భద్రతా పెన్షన్లను రూ.3,000 నుండి రూ.4,000కు పెంచినట్లు తెలిపారు. తిరుపతి నియోజకవర్గంలో 18,303 మంది లబ్ధిదారులకు వివిధ కేటగిరీల కింద ప్రతి నెలా రూ.8 కోట్ల 19 లక్షల మేర పెన్షన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఉదయం నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించడం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమమని అన్నారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అదనపు ఖర్చులు లేకుండా ఇంటి వద్దకే పెన్షన్లు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో క్లీన్ అండ్ బ్యూటీఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, మున్సిపల్ ఇంచార్జీ కమిషనర్ శారదా దేవి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# యాత్ర ముగించుకుని వస్తున్న హాజీలకు స్వాగతం

## -మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



**అమరావతి,కలంకౌంటర్ :** విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ద్వారా పవిత్ర మక్కా హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులు విజయవంతంగా యాత్ర ముగించుకొని తిరిగి వస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు.గన్నవరం విమానాశ్రయం నుంచి రెండు దశల్లో వెళ్లిన 333 మంది ప్రయాణికులు తిరిగి వస్తున్నారని సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. పవిత్ర మక్కా హజ్ యాత్ర -2026 కోసం ఆంధ్రప్రదేశ్ నుండి దాదాపు 2000 మంది యాత్రికులు బయలుదేరి వెళ్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విజయవంతంగా యాత్రను ముగించుకున్న హాజీల రాక ప్రారంభమైనట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ నుండి మొదటి దశలో ఏప్రిల్ 18,19 ?తేదీలలో విజయవాడ నుండి బయల్దేరిన 333 హజ్ యాత్రికులను ఎటువంటి ఇబ్బంది లేకుండా తిరిగి తీసుకురావడానికి మూడు ప్రత్యేక విమానాలలో వసతి కల్పించిన్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.సౌదీ అరేబియాలోని జెడ్డా నుండి విజయవాడకు వచ్చే యాత్రికులందరూ సురక్షితంగా, ప్రశాంతంగా తిరిగి రావడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మంగళ, బుధ, గురు వారం లలో విజయవాడ గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి యాత్ర ముగించుకుని వస్తున్న హాజీ లు ప్రత్యేక విమానాల్లో చేరుకుంటారని తెలిపారు.రోజుకు 111 మంది చొప్పున మూడు రోజుల్లో, మూడు ప్రత్యేక విమానాల ద్వారా హాజీలు గన్నవరంకు చేరుకుంటారని వెల్లడించారు.?2 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 01:10 గంటలకు,?3వ తేదీ బుధవారం మధ్యాహ్నం 01:00 గంటలకు,?4వ తేది గురువారం రాత్రి 11:20 గంటలకు తిరుగు ప్రయాణికులతో వస్తున్న విమానాలు విజయవాడకు చేరుకుంటాయని తెలిపారు.హజ్ యాత్రికులకు విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికేందుకు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించడం కూడా జరిగిందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఫరూక్ తెలిపారు. ?హజ్ యాత్రికుల కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజలు హాజీలు వస్తున్న ప్రత్యేక విమాన సమయాలను గమనించవలసిందిగా కోరుతున్నట్లు ఆయన తెలిపారు.విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లివచ్చిన ప్రతి ఒక్కరికి రూ. లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్త శు ద్ధి తో పనిచేస్తుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.


# ఐఐటీ తిరుపతిలో ఇంటర్న్‌షిప్‌కు ప్రకాశం ఇంజినీరింగ్ విద్యార్థినులు ఎంపిక





**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) చివరి సంవత్సరం విద్యార్థినులు కొత్తపల్లి సుప్రియ, రోహిణి ప్రతిష్ఠాత్మక ఐఐటీ తిరుపతిలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐఐటీ తిరుపతి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సెక్యూర్ అండ్ ఎఫిషియెంట్ విజన్ ఫర్ ఆటోనమస్ సిస్టమ్స్ ల్యాబ్లో శిక్షణ ఉంటుందని అన్నారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఏ ఐ, ఎం ఎల్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, డ్రోన్ విజన్, ఆబ్జెక్ట్ డిటెక్షన్, ఆటోనమస్ డ్రైవింగ్, ఫెడరేటెడ్ లెర్నింగ్ తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ పొందనున్నారు. చివరి సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగాలు పొందుటకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని అన్నారు.ప్రొఫెసర్ డా. ముప్పా లక్ష్మణరావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. చదలవాడ రవికుమార్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. ఎం.ఎం. రాయుడు,విద్యార్థినుల ఈ విజయంపై కళాశాల యాజమాన్యం, వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, హెచ్‌వోడిలు, అధ్యాపకులు, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో కోటి తులసి పూజ





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పెద్ద బజారు నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో కోటి తులసి పూజ ఆమె అర్చకులు అనిల్ స్వామి, పవన్ స్వాములు నిర్వహించారు. మే 21వ తేదీ స్వామివారికి జేష్ఠ మాసం సందర్భంగా జేష్టాఅభిషేకం నిర్వహించి కోటి తులసి పూజ ప్రారంభించారు. ప్రతిరోజు వందలాది మంది మహిళా భక్తులు విష్ణు సహస్రనామ పారాయణాన్ని ఉదయం, సాయంత్రం పఠించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ నగరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని జేష్ఠ మాసంలో శ్రీ కోదండ రామస్వామి వారికి కోటి తులసి పూజ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శ్రీ సీతారాముల అనుగ్రహం ఉంటుందని అన్నారు. కోటి విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం జయప్రదం చేయడానికి విశేష కృషి చేసిన ఇస్కాల శోభారాణి ని ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# పి4 స్ఫూర్తితో విద్యాదానం చేసిన.... డాక్టర్ పామూరు శ్రీధర్ కుటుంబం



**కావలి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ా4 స్ఫూర్తితో ,కావలినియోజక వర్గం శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సూచనలతో కావలి పట్టణానికి చెందిన మార్గదర్శులు డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ పామూరు.శివప్రసాద్, పామూరు రాజ లు వారితల్లి పామూరు ఉమ ఆశీస్సులతో మే నెల1వ తేదీ నుంచి 31వ తేదీ వం- కు నెల రోజుల పాటు 60 మంది విద్యార్థులకు కావలి పట్టణం తుఫాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉచిత సమ్మర్ స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహించి నేడు వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.పై కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కావలి నియోజకవర్గం పి4 కో ఆర్డినేటర్ యంగ్ ప్రొఫిషినల్ గుండెమడుగుల సత్యానందం, మార్గదర్శులు డాక్టర్ పామూరు శ్రీధర్, పామూరు శివప్రసాద్, పామూరు రాజ, సంయుక్త సేవా సంస్థ సీనియర్ సభ్యులు ఎం వి ఎన్ ప్రసాదరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మార్గదర్శి డాక్టర్ పి. శ్రీధర్ మాట్లాడుతూ వారి తల్లి కీ శే శ్రీమతి పామూరు ఉమ ఆశీస్సులతో విద్యాదానం చేయాలనే ఆలోచనతో కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సూచనలతో పి4 స్ఫూర్తితో సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో 60 మంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ క్లాసులను నెలరోజుల పాటు నిర్వహించామని తెలిపారు.విద్యార్థుల నేర్చుకున్న స్పోకెన్ ఇంగ్లీష్ భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.ఈ స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులను ఎంతో చక్కగా నిర్వహించిన సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులకు ఉపయోగపడే అనేక రకాల సేవలను వారి కుటుంబం తరపున కొనసాగిస్తామని తెలిపారు.పి4 కో ఆర్డినేటర్ యంగ్ ప్రొఫిషినల్ గుండెమడుగుల సత్యానందం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినా4 ని స్ఫూర్తిగా తీసుకొని నెల రోజుల పాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ ఇప్పించిన డాక్టర్ పి శ్రీధర్, డాక్టర్ పి శివప్రసాద్,పి రాజా లను అభినందించారు.60 మంది విద్యార్థులకు సుమారు 75 వేల రూపాయలు వెచ్చించి విద్యార్థులకు ఉచితంగా విద్యాదానం చేయడం గొప్ప విషయంఅనితెలిపారు.అనంతరం డాక్టర్ పి శ్రీధర్,పీ4 కో ఆర్డినేటర్ యంగ్ ప్రొఫిషినల్ గుండెమడుగుల సత్యానందం, స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ టీచర్ కళ్యాణ్ లను సంస్థ ద్వారా ఘనంగా సన్మానించారు.

# గోశాల ముసుగులో పశువుల అక్రమ రవాణాకు చెక్ పెట్టిన గుర్ల పోలీసులు - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజ్జింగవలసలోని ఓంశక్తి గోశాల నిర్వహణ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణపై విచారణ చేపట్టి, పశువుల అక్రమ రవాణాకు పాల్పడినట్లుగా గుర్తించి, అతడిపై గుర్ల పోలీసు స్టేషన్ లో ఇప్పటికే పలు కేసులు నమోదు చేసినట్లుగా జిల్లా లిఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - గుర్ల మండలం గుజ్జింగవలసలో ఓంశక్తి గోశాల నిర్వహిస్తున్న అట్టాడ రామకృష్ణపై ఇటీవల కొన్ని ఫిర్యాదులు రావడంతో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులును విచారణ చేపట్టాలని ఆదేశించామన్నారు. డీఎస్పీ రాఘవులు, చీపురుపల్లి సిఐ జి.శంకరరావు, గుర్ల ఎస్ఐ పి.నారాయణరావు విచారణ చేపట్టగా ఓంశక్తి గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లుగా వెల్లడైందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్ పరిధిలో వశువుల అక్రమ రవాణ నియంత్రణకు చర్యలు చేపట్టి, పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి, పోలీసులు స్వాధీనం (పట్టుకున్న) చేసుకున్న వశువులను సంరక్షించేందుకు గుజ్జింగవలస గ్రామంలోని ఓంశక్తి గోశాలకు అప్పగిస్తున్నామన్నారు. కానీ, సదరు గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణ పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితులతో కుమ్మక్కై, వివిధ పోలీసు స్టేషన్ అధికారులు సీజ్ చేసి, అప్పగించిన పశువులను తిరిగి పశువుల అక్రమ రవాణదారులకే విక్రయిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైందన్నారు. అంతేకాకుండా, గోశాలలో పశు వుల సంరక్షణకు చేపట్టాల్సిన రక్షణ చర్యలు తీసుకోకుండా పశువులకు అవసరమైన నీరు, ఆహారం వంటి కనీస అవసరాలు తీర్చకుండా, సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుగా, నిబంధనలను తుంగలో త్రొక్కినట్లుగా గుర్తించామన్నారు. నిబంధనకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణ పై ఇప్పటికే పలు కేసులు నమోదు చేశామని, గోశాల అనుమతులు రద్దు చేసేందుకు సిఫార్సు చేసినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఓంశక్తి గోశాలలో ఉన్న 79 పశు వులను సీజ్ చేసి, గరివిడిలో నూతనంగా నిర్మించిన మరో గోశాల తరలించి, వాటి సంరక్షణ బాధ్యతలను అక్కడ నిర్వాహకులకు అప్పగించామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. గోశాల నిర్వహణ ముసుగులో అక్రమాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఏదైనా సమాచారంను డయల్ 112/100 కు అందించాలని, పశువుల అక్రమ రవాణ నియంత్రణకు పోలీసుశాఖ చేవడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# అర్జీల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి - జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్





**బాపట్ల,కలంకౌంటర్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను పరిష్కరించేందుకు ఆయా పోలీస్ స్టేషన్ అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా పాల్గొని బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మొత్తం 44 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీ కి విన్నవించుకున్నారు. బాధితుల అర్జీలలో ప్రధానంగా కుటుంబ సమస్యలు, భూ తగాదాలు, భార్యాభర్తల వివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు తదితర సమస్యలు ఉన్నాయి. ఫిర్యాదిదారుల సమ- స్యలను కూలంకషంగా విన్న ఎస్పీ వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే స్పందించి వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. అలాగే పలువురు వృద్ధులు పీజీఆర్ఎస్ కు రాగా వారి సమస్యలను కూడా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదిదారుల అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. 2.02 కోట్లతో తడి, పొడి చెత్త శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన



**వినుకొండ,కలంకౌంటర్ :** పురపాలక సంఘం (మున్సిపాలిటీ) పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధుల ద్వారా రూ. 2.02 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'తడి మరియు పొడి చెత్త వ్యర్థాల శుద్ధి కేంద్రం' ఏర్పాటుకు కారంపూడి రోడ్డు లోని చెక్క వాగు ప్రాంతంలో సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరై, శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావుతో మున్సిపల్ అధికారులు, కూటమి నాయ కులు పాల్గొన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ఈ అత్యాధునిక వ్యర్థాల శుద్ధి కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని జీవీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# బంటుమిల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ ప్రవీణ కుమారి



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్ గా డాక్టర్ ఎన్ ప్రవీణ కుమారి ఎం ఎస్ సి, ఎస్ఫీల్డ్, పిహెచ్డి. ను ప్రభుత్వం నియమించింది. సోమవారం ప్రిన్సిపాల్ గా డాక్టర్ ప్రవీణ కుమారి బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ కుమారికి ఇన్చార్జి ప్రిన్సిపాల్ గా ఉన్న దేవ జయరాజు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ కుమారి కళాశాల అభివృద్ధికి ఉత్తమ ఫలితాల సాధనకు తన వంతు కృషి తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు.

# ఆల్ ఇండియా అత్యుత్తమ ర్యాంకులు



**కందుకూరు,కలంకౌంటర్ :** సోమవారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్డ్ (2026) ఫలితాలలో స్థానిక కందుకూరు బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ ఐఐటీ ఓ మెడికల్ అకాడమీ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్ బి.నరేంద్రబాబు ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు.టీ .శివ సాత్విక (119),బి .కార్తీక్ నాయుడు (264),పి . మోహన్ కుమార్ (513),ఎం . హర్షిత్ చౌదరి (2455),పి . ధాన్యా కిరణ్(2913),బి . అమృత కీర్తన (3625),ఆర్ . తరుణ్ కుమార్ (4202),పి . లోకేష్ (5172),ఆర్ . శాంసన్ రాజ్(5207),యు . వెరోనికా (5843) లు అత్యుత్తమంగా జాతీయస్థాయిలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి..కందుకూరు విద్యా చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ స్థాయిలో జాతీయ ర్యాంకులు రావడం ఇదే తొలిసారి అని డైరెక్టర్ బి.నరేంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లిబి.ఆర్. ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు విద్యార్థిని,విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తమ అకాడమీ అందించిన నాణ్యమైన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వం,విద్యార్థుల కఠోర శ్రమ వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ జి.బాల భాస్కరరావు, ప్రిన్సిపాల్స్,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమల ఆధారిత నైపుణ్యాభివృద్ధికి జాతీయ నమూనాగా ఎదుగుతున్న విశాఖ

## -టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎం ఎల్ ఎ పల్లా శ్రీనివాసరావు




**విశాఖపట్నం,కలంకౌంటర్ :** పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్య నిర్మాణ రంగాల్లో విశాఖపట్నం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి పారిశ్రామిక శిక్షణా సంస్థల ఆధునికీకరణ పథకం (పీఎం-సేటూ) కింద వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు ఆమోదం పొందిన దేశంలోని తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవడం విశాఖపట్నం అభివృద్ధి ప్రస్థానంలో ఒక ముఖ్యమైన ఘట్టమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ, ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థ భాగస్వామ్యంతో రూపొందించిన విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు ఆమోదం తెలిపింది. ఈ ఆమోదంతో పీఎం-సేటూ పథకం కింద పరిశ్రమలను ప్రత్యక్ష భాగస్వాములుగా చేసుకుని అమలులోకి వచ్చిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. విశాఖపట్నం జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థల ద్వారా రానున్న ఐదేళ్లలో 25 వేల మందికి పైగా యువత ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. రూ.200.21 కోట్ల వ్యయంతో అమలుకానున్న ఈ ప్రాజెక్టు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలకు వారిని సిద్ధం చేయనుంది. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ ఘనత ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పనలను ఒకే అభివృద్ధి సూత్రంగా మలిచిన నాయకత్వం వల్లే ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని పేర్కొన్నారు. "స్థిరమైన ఆర్థికాభివృద్ధికి నైపుణ్యం కలిగిన యువశక్తి అత్యంత కీలకమని చంద్రబాబు నాయుడు గారు ఎప్పటి నుంచో విశ్వసిస్తున్నారు. పెట్టుబడులను రప్పించడం మాత్రమే కాదు, ఆ పెట్టుబడుల ద్వారా సృష్టించే అవకాశాలను రాష్ట్ర యువత అందిపుచ్చుకునేలా చేయడమే ఆయన లక్ష్యం. ఈ విజయానికి అదే పునాది" అని పల్లా అన్నారు. అలాగే ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాల మధ్య సమన్వయం కల్పిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన అభివృద్ధి వాతావరణాన్ని ఆయన నిర్మిస్తున్నారని చెప్పారు. "విశాఖపట్నాన్ని పెట్టుబడులు, ఆవిష్కరణలు, తయారీ రంగం, ఉపాధి అవకాశాలకు కేంద్రబిందువుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో నారా లోకేష్ గారు నిరంతరం పనిచేస్తున్నారు. విద్యాసంస్థల బలోపేతం, నైపుణ్య శిక్షణ విస్తరణ, పరిశ్రమలతో అనుసంధానం వంటి చర్యలు ఉత్తరాంధ్ర ఆర్థిక భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. పీఎం-సేటూ కార్యక్రమం కేవలం శిక్షణా సంస్థల ఆధునికీకరణకే పరిమితమైనది కాదని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థల మధ్య ఏర్పడిన వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది ప్రతీక అని పల్లా వివరించారు. ఉక్కు, తయారీ, లాజిస్టిక్స్, స్వచ్ఛ ఇంధనం, సాంకేతిక రంగాలు, పారిశ్రామిక సేవల రంగాల్లో విశాఖపట్నం వేగంగా ఎదుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం మరింత పెరుగుతోందన్నారు. ఆ అవసరాన్ని తీర్చేందుకు విశాఖ ఐటీఐ క్లస్టర్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 20 లక్షల ఉద్యోగాల సాధనలో ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలను యువతకు అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించడమే కాకుండా రాష్ట్ర పారిశ్రామిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. "ప్రతి పెట్టుబడికి ప్రతిభ అవసరం. ప్రతి పరిశ్రమకు నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ప్రతి ఉపాధి లక్ష్యానికి బలమైన శిక్షణా వ్యవస్థ అవసరం. ఈ మూడు అంశాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కార్యక్రమమే ఇది. వేలాది మంది యువత భవిష్యత్తుకు ఇది కొత్త దారులు తెరవడంతో పాటు విశాఖపట్నాన్ని పరిశ్రమల ఆధారిత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనలో జాతీయ నమూనాగా నిలబెడుతుంది" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ, ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థతో పాటు అన్ని భాగస్వామ్య సంస్థలకు పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. "భవిష్యత్తును నడిపించేది ప్రతిభావంతమైన మానవ వనరులే. దూరదృష్టి గల నాయకత్వం, ప్రగతిశీల విధానాలు, పరిశ్రమల భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధిని పెట్టుబడులు, ఉపాధి, సమగ్ర ఆర్థికాభివృద్ధికి మూలాధారంగా ఎలా మలచవచ్చో ఆంధ్రప్రదేశ్ దేశానికి చూపిస్తోంది" అని ఆయన అన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు భాధ్యత తీసుకుంటా -రాష్ట్ర మంత్రి కొల్లు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు సోమవారం ఉదయం మంత్రివర్యులు, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలసి మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 20 వ డివిజన్ గిలకలదిండిలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొందరు ప్రజలు తమ ప్రాంతంలో అర్హులైన కొంతమందికి పింఛన్లు రాలేదని వారికి పింఛన్లు మంజూరు చేయాలని, కొన్ని పింఛన్లు సరిగా అందడం లేదని మంత్రి దృష్టికి తీసుకొని వచ్చారు. దీంతో మంత్రి వెంటనే స్పందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కొన్ని సాంకేతిక కారణాల వలన పింఛన్లు అందకపోయి ఉండవచ్చని ఎవరికైనా రాకపోతే తప్పకుండా పింఛన్లు అందజేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూడా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని గిలకలదిండిలో పేదల సేవల కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నామన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఒకటవ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఈ రాష్ట్రంలో ప్రతి ఒక్క పేదవాడు కూడా ఇబ్బంది పడకూడదనీ, ప్రతి ఒక్కరికి కూడా ఒక భరోసా, ధైర్యం కల్పించాలనేది ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. . అందుకోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర దగ్గర 64 లక్షల మందికి ఈ పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. వృద్ధులు వితంతువులకు 4 వేల రూపాయలు, దివ్యాంగులకు 6 వేల రూపాయలు, అదేవిధంగా మరి మూత్రపిండాల వ్యాధి తదితర దీర్ఘ వ్యాధులతో బాధపడే వారికి 10 వేల రూపాయలు, అలాగే పూర్తిగా ఆరోగ్యం బాగాలేక మంచానికే పరిమితమై ఉన్నవారికి 15 వేల రూపాయలు పింఛన్ల రూపంలో అందజేస్తున్నామన్నారు. దేశం మొత్తంలో కూడా ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ప్రతి సంవత్సరం ఈ పింఛన్ నిమిత్తం 35 వేల కోట్ల రూపాయలు ఇప్పటికి దాదాపు 60 వేల కోట్ల రూపాయలు ఈ పేదరిక సేవలు కార్యక్రమం కింద ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. అలాగే ఈ రోజు ఇక్కడ మచిలీపట్నంలో ఇక్కడ ఉన్న గ్రామీణం పట్టణ ప్రాంతాలతో కలిపి 30 వేల పింఛన్లు అర్హులందరికీ ఇస్తున్నామన్నారు. . అలాగే ఎవరైనా భర్త చనిపోతే తక్షణమే మరుసటి నెలలో వారి భార్యకి పించను ఇస్తున్నామన్నారు.. ఇక్కడే కొత్త పించను కూడా అందజేస్తున్నామన్నారు. . ఇంకా కొత్తగా వితంతువులకి, వృద్ధులకి, వికలాంగులకి పింఛన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్థిక పరిస్థితులన్నీ కూడా గమనంలోకి తీసుకొని త్వరలోనే మిగిలినవి కూడా అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు . దశల వారీగా అది వితంతువులకు, దివ్యాంగులకు వృద్ధులకు ఎవరికి ముందు పించను ఇవ్వాలో రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో నిర్ణయం తీసుకుంటారన్నారు అలాగే రేషన్ బియ్యం కూడా ప్రతి ఒక్కరికీ 5 కిలోల చొప్పున అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే త్వరలో పాఠశాలలు తెరవబోతున్నాం కాబట్టి తల్లికి వందనం పథకం కింద 10,000 కోట్ల రూపాయలు ఈ నెలలో మళ్ళీ తల్లి బ్యాంకు ఖాతాకు జమ చేయబోతున్నామన్నారు. అట్లాగే అన్నదాత సుఖీభవ రైతులకు పెట్టుబడి సాయం,, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయిందని, మరి ముఖ్యంగా ఆడపిల్లలకు భరోసా ఉండే కార్యక్రమం స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ గ ఎన్నికల ముందు పేదవారికి ఏ రకమైన హామీలు అయితే ఇచ్చామో ఆ సూపరు సిక్సు పథకాలను కూడా ఖచ్చితంగా అమలు చేస్తూ ఇవాళ ఇంటింటికి ప్రతి నెల మొదటి తేదీనే పించను ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో పింఛను సరిగ్గా అందక పేదలు ఇబ్బంది పడేవాళ్ళనీ, నేడు ప్రతి నెల 1వ తేదీనే ప్రతి ఇంటికి వెళ్లి మరి ఉదయాన్నే ఇవ్వాలనేది ఈ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమన్నారు. ఇవాళ ప్రభుత్వం పేద వారికి అండగా నిలబడి నిశ్చయంగా సంకల్పంగా ఆదుకుంటూ ఉందన్నారు . అలాగే ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని ఆ విధంగానే. ఆడపిల్లలకు ఉచిత బస్సు ప్రయాణంమే కాకుండా దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీని కచ్చితంగా అమలు చేసే ప్రభుత్వం కొండపల్లి ప్రభుత్వం. ఈ రోజున ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఈ ప్రభుత్వం వల్ల ఏర్పడినా కూడా ఇవాళ పేదవారికి అండగా నిలబడతాం అనేదాన్ని ప్రాధాన్యతగా తీసుకుని ఈ రోజున ఇచ్చిన హామీలన్నిటిని కూడా అమలు చేస్తూ ఇవాళ పేదవారికి అండగా నిలబడుతున్నటువంటి ఈ ప్రభుత్వానికి, ఎక్కడికి వెళ్ళినా కూడా ప్రజలంతా కూడ అభినందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు చింతా వీర్రాజు 60 సంవత్సరాలు మంచంలో నుండి లేవలేని స్థితిలో ఉన్నారని ప్రస్తుతం ఇస్తున్న 4000 రూపాయలను 15వేల రూపాయలకు పెంచాలని చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వారి సతీమణి మంత్రిని కోరగా వెంటనే మంత్రి స్పందిస్తూ ధైర్యంగా ఉండాలని చెబుతూ అర్జీ పంపించాలని సూచించారు. పక్షవాతం వచ్చి మాట పడిపోయిన తిరుమాని లక్ష్మణస్వామి (62 సంవత్సరాలు ) పింఛను మంజూరు చేయాలని వారి బంధువులు మంత్రిని కోరగా మంత్రి వెంటనే స్పందిస్తూ అతనిని ఓదారుస్తూ ధైర్యంగా ఉండాలని అర్జీ పెట్టుకుంటే పింఛను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మున్సిపల్ ఇన్చార్జి ప్రాజెక్టు అధికారి రాజేంద్రప్రసాద్, వార్డు సచివాలయ కార్యదర్శులు నవీన్, సీతారామయ్య, బలరామకృష్ణ, స్థానిక నాయకులు ఇలియాస్ భాష, సుశీల, మత్స్యకార సంఘాల నాయకులు తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# చేతి వ్రాత శిక్షణ తరగతులు ముగింపు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం గాంధీ విద్యాలయ హై స్కూల్ లో విద్యార్థులకు వేసవి చేతి వ్రాత నైపుణ్య శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గాంధీ విద్యాలయ కన్వీనర్ మాజేటి చక్రవర్తి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
కలంకౌంటర్ దినపత్రిక లో
యాడ్స్ కోసం సంప్రదించండి..
సెల్ : 9346935672

# పంచ్ ప్రభాకర్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

## -బొగ్గవరపు సుబ్బారావు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు




**ఒంగోలు,కలంకౌంటర్ :** ఆర్యవైశ్యులపై సోషల్ మీడియా ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేసి, ఆర్యవైశ్యులను కించపరిచిన పంచ్ ప్రభాకర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు అన్నారు. ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ ఈసీ మెంబర్ జలదంకి వెంకటకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులతో కలిసి ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులపై అకారణంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన పంచ్ ప్రభాకర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమాజంలో తమ వ్యాపారాలు చేసుకుంటూ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ఉండే ఆర్యవైశ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని ఉన్నారు. భవిష్యత్తులో మరెవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా పంచ్ ప్రభాకర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురారి శెట్టి సుధీర్ కుమార్, ప్రధాన కార్యదర్శి బైసాని వెంకట సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ తటవర్తి శివన్నారాయణ, రాష్ట్ర ఈసీ నెంబర్ గుర్రం చిన్న అల్లూరయ్య, యూత్ ప్రెసిడెంట్ నూనె అనుదీప్, వివిధ మండల అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పాటించండి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** డ్రైనేజీలలో ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం వేయడం వల్ల నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెంది ఆరోగ్యం ప్రమాదకర స్థితిలో ఉంటుందని, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీ పు కార్యక్రమంలో భాగంగా సోమవారం 45వ డివిజన్ పరిధిలోగల మెయిన్ రోడ్డు బజాజ్ షోరూం ప్రక్కనగల డ్రైనేజీలోని ప్లాస్టిక్ వస్తువులను, చెత్తాచెదారమును తొలగించి, అక్కడ ఉన్న చిరు వ్యాపారస్తులకు డ్రైనేజీలలో ప్లాస్టిక్ వస్తువులు, కుళ్లిపోయిన పండ్లు, చెత్తాచెదారం వెయ్యవద్దని అవగాహన కల్పించిన స్టేట్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి వి ఫణి కుమార్ . ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ శానిటేషన్ సెక్రెటరీ, మాచవరపు మానస, బట్రాజు సాయి, తదితరులతో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# భయం లేని బాల్యానికి అంగన్వాడీలే శరణ్యం



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** పసితనం నుంచే భయం లేని బాల్యాన్ని విషయ అవగాహనాన్ని పెంపొందించేందుకు పిల్లలను అంగన్వాడీలకు పంపాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజిని పిలుపునిచ్చారు. మండలంలోని కలవపాముల గ్రామంలో సోమవారం అంగన్వాడి అవగాహన ర్యాలీని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలను అంగన్వాడీలకు పంపించడం వల్ల వారిలో పాఠశాలల పట్ల చదువు పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి ప్రతి అంశాన్ని అవగాహన కలిగించుకుని చొరవను పెంపొందించవచ్చునని అన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com